
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
31-12-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

ఆర్చరీలో అద్వితీయ ప్రతిభ



2



2

అయ్యప్ప ఆలయంలో గణపతి హోమం

## రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన




**అక్షటుడే, పెద్ద కొడప్‌గల్:** మండల కేంద్రంలో గాంధీ చౌక్ వద్ద ఎస్సై అరుణ్ కుమార్ ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రహదారిపై ప్రయాణం చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్లు ఇతర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.



## నిజామాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇలా త్రిపాఠి

**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఇలా త్రిపాఠి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మధ్యాహ్నం 2.40 గంటలకు కలెక్టరేట్‌కు ఆమె చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా సాదరంగా స్వాగతం పలికారు. ఐఏఎస్ ఇలా త్రిపాఠి నేరుగా తన ఛాంబర్‌కు చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్‌ను పలు శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి పరిచయం చేసుకున్నారు. కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్‌కు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం బదిలీ అయిన విషయం తెలిసిందే.




కాల చక్రం గిర్రున తిరిగింది. చూస్తుండగానే మరో ఏడాది కరిగిపోయింది. ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చిన 2025 కాలగర్భంలో కలిసిపోయింది. ఎన్నో తీపి గుర్తులు.. కష్టాలు, సుఖాలు, ఆనంద క్షణాలు, విషాద సంఘటనలను మిగిల్చి ముగిసిపోయింది. కొంగొత్త ఆశలతో 2026వ సంవత్సరం ఆరంభం కాబోతుంది. నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి విందు వినోదాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఉల్లాసభరితంగా నిర్వహించేందుకు యువత నిమగ్నమైంది.

- అక్షరటుడే, ఇందూరు




# నయా జోష్

- న్యూ ఇయర్ వేడుకలకు సర్వం సిద్ధం
- జోరుగా కేక్‌లు, మద్యం విక్రయాలు
- మార్కెట్‌లో సందడి





నూతన సంవత్సర వేడుకలు నిర్వహించేందుకు అంతా సిద్ధమయ్యారు. 12 గంటలకు కేక్ కట్ చేసి కొత్త ఏడాదికి స్వాగతం పలకనున్నారు. దీంతో నగరంలోని బేకరీలు బిజీగా మారాయి. విక్రయదారులను ఆకర్షించేలా.. రకరకాల కేక్‌లను తయారు చేశారు. పలువురు వ్యాపారస్తులు ఆఫర్లు ప్రకటించడంతో కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. అలాగే కూల్ డ్రింక్‌లు, మాంసాహారం, స్నాక్స్ దుకాణాల్లోనూ సందడి నెలకొంది. కొందరు యువత టపాసులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. అలాగే మద్యం విక్రయాలు సైతం జోరుగా సాగుతున్నాయి.

### నిబంధనలు పాటించాలి


ప్రజలు కొత్త సంవత్సరానికి కోటి ఆశలతో స్వాగతం పలకనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే కొత్త ఏడాది సంబరాలు విషాదకరంగా మారకుండా నిబంధనలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా.. సౌండ్ సిస్టం పెట్టొద్దని చెబుతున్నారు. అర్ధరాత్రి రోడ్లపై హంగామా చేయొద్దని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.






## గుత్ప ఎత్తిపోతల నీటి విడుదల

**అక్షరటుడే, ఆర్మూర్ :** యాసంగి వరి పంట సాగు కోసం గుత్ప ఎత్తిపోతల ద్వారా నీటిని నీటిపారుదల శాఖ అధికారులు విడుదల చేశారు. ఈ మేరకు బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ నజీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. యాసంగి పంటల కోసం రైతుల కోరిక మేరకు లిఫ్ట్ నుంచి నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఈ నీటిని పొదుపుగా వాడుకుని శాఖాధికారులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆర్మూర్ సర్కిల్ డీఈ పవన్ కుమార్, నందిపేట్ డీఈఈ రవి కుమార్, ఏఈఈ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



## వైభవంగా ఆరట్టు ఉత్సవం

**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలో ఆరట్టు ఉత్సవాన్ని స్వాములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురు స్వాములు, అయ్యప్ప స్వాములు ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా అయ్యప్ప ఆలయం నుంచి దేవుడి ప్రతిమను ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ అయ్యప్ప నామస్మరణతో ముందుకు సాగారు. ఇందులో భాగంగా స్వాములు భక్తిలో లీనమై నృత్యం చేశారు. స్వామి వారి ప్రతిమ వీధుల గుండా వెళ్తుంగా మహిళలు ఇంటింటికీ హారతి పట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్వాములు భక్తులు పాల్గొన్నారు.

## అనర్హులకు ఇందిరమ్మ ఇల్లు

**అక్షరటుడే, బోధన్ :** ఇళ్లు లేని పేదలకు సొంతగూడు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తీరుపై కలెక్టర్ స్థాయిలో అధికారులు పథకం అమలు తీరును పర్యవేక్షిస్తున్నారు. అయినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన ఓ స్థాయి అధికారులు ఇళ్ల కేటాయింపుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బోధన్ పట్టణంలోని 23వ డివిజన్‌లో ఓ లబ్ధిదారురాలి పేరుతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఆమె విదేశాల్లో చదువుకుంటోంది. సదరు లబ్ధిదారురాలు పోలీస్ శాఖలో పనిచేసే ఓ ఉద్యోగి కూతురు. అయినప్పటికీ ఆమె పేరుతో ఇందిరమ్మ గృహాన్ని అధికారులు మంజూరు చేశా రు. ఈ క్రమంలో నాలుగు బిల్లులు కూడా మంజూరయ్యాయి. ఓ ప్రభుత్వ ఉద్యోగి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరవ్వడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఈ విషయమై బోధన్ కమిషనర్ జాదవ్ కృష్ణను వివరణ కోరగా ఎలక్షన్ పనుల్లో బిజీగా ఉన్నామని.. మేనేజర్ రమేష్‌ను కలవాలని సూచిం చారు. మేనేజర్‌ను సంప్రదించగా ఎలక్షన్ పనుల్లో ఉన్నామని నెల తర్వాత దానిపై వివరణ ఇస్తానన్నారు.

## శ్రీ చంద్ర పాఠశాలకు షోకాజ్ నోటీసు జారీ

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని శ్రీ చంద్ర పాఠశాలకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఆర్మూర్ ఎంఈవో రాజగంగారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేని భవనంలో తరగతులు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో వివరణ కోరుతూ షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు చెప్పారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండోలో బంగారు పతకాలు



**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు 10 బంగారు పతకాలు సాధించారు. గెలుపొందిన క్రీడాకారులు జనవరి 13 నుంచి 15వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని జిల్లా తైక్వాండో అమెచ్యూర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అసోసియేషన్ ఛైర్మన్ బస్వా లక్ష్మీ నర్సయ్య బుధవారం అభినందించారు.



## బాలసదన్‌లో చిన్నారులతో కలెక్టర్ న్యూఇయర్ వేడుకలు

**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లా కేంద్రంలోని బాలసదన్ పిల్లలకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. అక్కడికి వెళ్లి చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులతో కలసి సహపంక్తి భోజనం చేసి, వారి సంక్షేమానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. బాలల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న బాలసదనం భవన నిర్మాణాన్ని పరిశీలించి అన్ని హంగులతో మార్చిలోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ట్రెయినీ రవితేజ, డీడబ్ల్యూవో ప్రమీల, జిల్లా బాలల పరిరక్షణ అధికారి స్రవంతి, పంచాయతీరాజ్ అధికారులు, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ముగిశాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు ఫలితాలు వెలువడడంతో.. నూతన కార్యవర్గానికి బుధవారం ఎన్నికల అధికారి భాను నియామక పత్రాలు అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా పంచరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా వాగ్మారే సుభాష్, నిర్వహణ కార్యదర్శిగా రాజు, ఉపాధ్యక్షులుగా బైస సంగీత, సతీష్ గౌడ్, గోవిందరాజు, సంయుక్త కార్యదర్శులుగా ఐరవేణి సురేష్, రవి నాయక్, ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా ఆడెపు శ్రీనివాస్, రవి కుమార్, సందీప్ దేశ్‌ముఖ్, సందీప్ గౌడ్, రవి చరణ్ రెడ్డి, తాళ్ల శ్రీధర్, జయపాల్, సితారె కృష్ణ, నరేందర్ స్వామి, ప్రీతం రెడ్డి, పబ్బు భుమేష్, సుదర్శన్ ఎన్నికయ్యారు. అలాగే ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో గెలుపొందిన అర్బన్ ప్రింట్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ సభ్యులు రాజు, సతీష్ గౌడ్, సుదర్శన్, సితారె కృష్ణలను బుధవారం ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షులు ప్రసాదరావు, బాలస్వామి, విద్యాసాగర్, సాయిలు, వెంకటేష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.






## పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**అక్షరటుడే, బాన్సువాడ:** పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 78మంది లబ్ధిదారులకు రూ.78లక్షల విలువైన చెక్కులను అందజేశారు. రుద్రూర్ మండలంలో 51మంది లబ్ధిదారులకు రూ.51లక్షలు చెక్కులు అందజేశారు. చందూర్ మండలంలో 27 మంది లబ్ధిదారులకు రూ.27లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో 17 మందికి, రాయకూర్ గ్రామంలో 13 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రుద్రూర్, చందూర్ మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# అయ్యప్ప ఆలయంలో గణపతి హోమం



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలోని ఉత్తర శబరిమల శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో బుధవారం ఉదయం గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప భక్తులు తమ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ప్రారంభించే ముందు అడ్డంకులు తొలగిపోవడానికి, విజయం సంపద, జ్ఞానం కోసం చేసే ఒక ముఖ్యమైన పూజ కార్యక్రమం అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాధారణంగా అయ్యప్ప మాలధారణ స్వాముల ఇరుముడి సందర్భంగా ముందుగా గణపతి హోమం చేపట్టి ప్రయాణం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేద బ్రాహ్మణులు జయకృష్ణ, ఆలయ ధర్మకర్త రవిగౌడ్ గురుస్వామి, గురుస్వాములు చంద్రమౌళి, సిద్ధగౌడ్, రామారావు, దత్తు,కన్నె గురుస్వామి గిరిధర్ నాయుడు స్వామి, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



# బాల్కొండలో ఘనంగా సునీల్ రెడ్డి జన్మదిన వేడుకలు

**అక్షరటుడే, బాల్కొండ:** కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆయా మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అనాథాశ్రమాన్ని సందర్శించి చిన్నారులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాల్కొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గున్నాల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, సేవాధర్మమే నిజమైన రాజకీయాల లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### ముప్కాల్‌లో..

**అక్షరటుడే, ముప్కాల్:** కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి జన్మదినం సందర్భంగా ముప్కాల్ మండల కేంద్రంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సునీల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



బాల్కొండ నియోజకవర్గంలో..

# బడాపహాడ్ ఉర్సులో పాల్గొన్న పోచారం




**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని మండలంలోని బడాపహాడ్ పైన హజ్రత్ సయ్యద్ షాదుల్లా హుస్సేని బాబా దర్గా (బడాపహాడ్) ఉర్సును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు పాల్గొన్నారు. జలాల్‌పూర్ గ్రామంలో గంధం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో గంధం సమర్పించి ప్రార్థనలు చేశారు. ఉర్సు సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పోచారం తెలిపారు. కార్యక్రమంలో వర్ని మండల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో మైనారిటీలు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఈ మేరకు ఆర్మూర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ బాధితులకు ఫోన్లను తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోన్లను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.



విలువిద్య (ఆర్చరీ) అనేది శారీరక శ్రమతో పాటు ఏకాగ్రత, సహనం, నిరంతర సాధన చేస్తేనే విజయం సాధ్యమయ్యే క్రీడ. లక్ష్యంపై చూపు నిలిపి, మనసును నియంత్రిస్తూ బాణాన్ని సంధించగలిగిన వారికే ఇందులో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. అలాంటి విలువిద్యలో మొదటి ప్రయత్నంలోనే జాతీయ స్థాయికి ఎంపికైంది విద్యార్థిని దీపిక. ఈ అరుదైన ఘనతను సాధించిన ప్రతిభావంతురాలుగా గుర్తింపు తెచ్చుకుంటోంది. - అక్షరటుడే, బాన్సువాడ

# ఆర్చరీలో అద్వితీయ ప్రతిభ

■ చిన్న వయస్సులోనే రాణిస్తున్న దీపిక ■ మొదటి ప్రయత్నంలోనే జాతీయస్థాయికి.. ■ కొత్తబాది గ్రామం నుంచి జార్ఖండ్‌కు..

బాన్సువాడ మండలం కొత్తబాది గ్రామానికి చెందిన ప్రకాష్, సుక్కుబాయి దంపతుల కుమార్తె దీపిక. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని, చిన్న వయసులోనే క్రీడలపై అపారమైన ఆసక్తి కనబర్చింది. చదువుతో పాటు ఆటలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలనే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఆమెకు బలంగా నిలిచింది.

### బహుముఖ క్రీడా ప్రతిభ..

దీపికకు ఆర్చరీ ఒక్కటే కాదు.. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో కూడా మంచి ప్రతిభ చూపింది. ఈ క్రీడల ద్వారా వచ్చిన శారీరక దృఢత్వం, వేగం, సమన్వయం ఆర్చరీలో ఆమెకు ఎంతో ఉపయోగపడింది. అలాగే తల్లిదండ్రుల ప్రోత్సాహం, పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో ఆమె ముందడుగు వేస్తోంది.

### ఆర్నెళ్ల సాధన.. అద్భుతమైన ఫలితం

కేవలం ఆర్నెళ్ల శిక్షణతోనే ఆర్చరీలో పట్టు సాధించడం దీపిక ప్రత్యేకత. ప్రతిరోజూ సాధన, వ్యాయామ ఉపాధ్యాయుడు పీర్య సూచనలను క్రమశిక్షణతో పాటించింది. ఓటమికి భయపడకుండా ప్రతి ప్రయత్నాన్ని నేర్చుకునే అవకాశంగా మార్చుకోవడం విజయానికి కారణాలుగా నిలిచాయి. లక్ష్యాన్ని ఛేధించాలంటే ముందు ఏకాగ్రత ముఖ్యమనే సూత్రాన్ని దీపిక అక్షరాలా పాటించింది.

### రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి..

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో దీపిక అద్భుత ప్రదర్శన కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ద్వారా తన ప్రతిభను నిరూపించుకుంది. ఇది ఆమె వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, కొత్తబాది గ్రామానికి, బాన్సువాడ మండలానికి గర్వకారణంగా మారింది. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు దీపికను అభినందిస్తూ, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు. సరైన ప్రోత్సాహం, క్రమశిక్షణతో కూడిన సాధన ఉంటే ఏ లక్ష్యమైనా సాధ్యమేనని దీపిక నిరూపిస్తోంది.

### ప్రావీణ్యం పొందింది..



దీపిక ఆర్నెళ్లలోనే విలువిద్యలో మంచి ప్రావీణ్యం పొందింది. మొదటి ప్రయత్నంలోనే జాతీయస్థాయికి ఎంపికైంది. గత నెల వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. జనవరి 4 నుంచి 8 వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో నిర్వహించే జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొననుంది. – పీర్య, పీఈటీ

# వేదిక్ మ్యాథ్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



**అక్షరటుడే, భీమ్‌గల్ :** పట్టణంలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని యెన్ను శ్రీకరి రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలకు ఎంపికైంది. ఆర్మూర్‌లో మంగళవారం 'విశ్వం ఎడ్యుటెక్' ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో శ్రీకరి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ ఘనత సాధించారు. భీమ్‌గల్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు యెన్ను శ్రీధర్ కుమార్తె అయిన శ్రీకరి, వేగంగా గణిత సమస్యలను సాధించి న్యాయ నిర్ణేతల ప్రశంసలు పొందింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన శ్రీకరిని పాఠశాల ప్రధానాచార్యులు రాస రవికుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి. నర్సారెడ్డి, అకడమిక్ ఇన్‌ఛార్జి పి.సాయిచరణ్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థిని ఈ స్థాయికి చేరడంలో కృషి చేసిన వేదిక్ మ్యాథ్స్ ఉపాధ్యాయులు సీహెచ్.కార్తీక్, ఎన్.రాకేష్, ఆర్.రవికుమార్, డి.స్రవంతిలను కూడా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి పాఠశాలకు, భీమ్‌గల్ ప్రాంతానికి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సోమార్‌పేట్ జీపీ పాలకవర్గం ప్రమాణస్వీకారం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సోమార్‌పేట్ గ్రామపంచాయతీ పాలకవర్గం అనివార్య కారణాల వల్ల ప్రమాణస్వీకారం నిర్వహించలేదు. గ్రామంలో జరిగిన గొడవల కారణంగా కార్యక్రమాన్ని అధికారులు వాయిదా వేశారు. కాగా.. తాజాగా సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులతో బుధవారం ఎంపీడీవో తాహెరా బేగం ప్రమాణ స్వీకారం చేయించారు. గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజాపాలన కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆమె నూతన పాలకవర్గానికి సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రకాష్ గ్రామస్థులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం మహోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్సై మహేష్ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.



# సెల్‌ఫోన్లపై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల ప్రదర్శన




**అక్షరటుడే, బాన్సువాడ:** సెల్‌ఫోన్లను జాగ్రత్తగా వినియోగించాలని పేర్కొంటూ బాన్సువాడ పట్టణంలోని వాసవి పాఠశాల విద్యార్థులు వినూత్న ప్రదర్శన చేపట్టారు. సెల్‌ఫోన్ వినియోగంపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు నృత్య ప్రదర్శనలు, నినాదాల ద్వారా సెల్‌ఫోన్లను అనవసర విషయాలకు కాకుండా విద్య, జ్ఞానం, మన అవసరాలకు ఎలా ఉపయోగించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌తో దుర్వినియోగం వల్ల కలిగే నష్టాలు, సరైన వినియోగం వల్ల వచ్చే లాభాలపై విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా స్పష్టంగా వివరించారు. వాసవి హైస్కూల్ హెచ్‌ఎం బి.లక్ష్మి శ్వేత, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

# పోచంపాడ్‌లో వీధిదీపాల ఏర్పాటు ప్రారంభం



**అక్షరటుడే, మెండోరా:** పోచంపాడ్ గ్రామంలో వీధి దీపాల ఏర్పాటును ప్రారంభించారు. సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పోచంపాడ్ బస్టాండ్ నుంచి చౌరస్తా వరకు వీధిదీపాల ఏర్పాటు పనులను సర్పంచ్ కోడముంజ మాధురి రాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

# 102 వాహనాల్లో పైలెట్ల నియామకాల కోసం ఇంటర్వ్యూలు

**అక్షరటుడే, ఇందూరు :** 102 వాహనాల్లో పైలెట్ల (డ్రైవర్ల) పోస్టులకు నియామకాలు చేపట్టనున్నారు. ఈ మేరకు బుధవారం ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ సంస్థ జిల్లా ఇన్‌ఛార్జి జనార్దన్ ప్రకటన విడుదల చేశారు. జనవరి 2, 3 తేదీల్లో ఇంటర్వ్యూలు ఉంటాయని ఆయన వెల్లడించారు. 102 వాహనంపై పైలెట్ ఉద్యోగానికి గాను ఆసక్తి గల యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. పైలెట్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే వ్యక్తులు కనీసం ఎస్సెస్సీ పాసై ఉండాలని సూచించారు. వయస్సు 23 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు ఉండాలని నిజామాబాద్ జిల్లాలోనే పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఇంటర్వ్యూలు జిల్లా జనరల్ ఆస్పత్రిలోని '108' కార్యాలయంలో ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని ఇతర వివరాలకు 9100799161 నంబరును సంప్రదించాలని సూచించారు. పైలెట్ పోస్టు కోసం ఇంటర్వ్యూలకు వచ్చేవారు తప్పనిసరిగా ఎస్సెస్సీ, ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్(బ్యాడ్జ్) వెంట తీసుకుని రావాలన్నారు. అలాగే అన్ని సర్టిఫికెట్లలోనూ డేట్ ఆఫ్ బర్త్ తప్పనిసరిగా కరెక్టుగా ఉండాలని సూచించారు. అభ్యర్థులకు మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.



# యూరియా కేంద్రాల వద్ద షామియానాలు ఏర్పాటు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండలంలో యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు షామియానా ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశానుసారం యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు నీడ, తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు అనుసరించి ఎల్లారెడ్డి మండలంలో పీఏసీస్ ఎల్లారెడ్డి పంపిణీ కేంద్రాన్ని వ్యవసాయ అధికారులు అనిల్ కుమార్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ముఖిద్ పరిశీలించారు.



# పోస్టాఫీస్ వద్ద కూల్ వాటర్ క్యాన్ల ఏర్పాటు

**అక్షరటుడే, బాల్కొండ:** కిసాన్‌నగర్ పోస్టాఫీస్ వద్ద లయన్స్ క్లబ్ బాల్కొండ-కిసాన్‌నగర్ ఆధ్వర్యంలో కూల్ వాటర్ క్యాన్లను ఏర్పాటు చేశారు. పోస్టాఫీస్‌కు వచ్చేవారు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారనే సమాచారంతో ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాన్లను జోనల్ ఛైర్మన్ సాగర్ రెడ్డి, బాల్కొండ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, సర్పంచ్ రాంరాజ్ గౌడ్ చేతుల మీదుగా సబ్ పోస్ట్‌మాస్టర్ ప్రియకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వంశీ, మధు, సునీల్ పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్‌లో ఆరోగ్య శిబిరం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వ్యవసాయ, విద్యాశాఖ, వ్యవసాయ పరిశోధన స్థానాల ఆధ్వర్యంలో నిర్వహించారు. దీంట్లో భాగంగా డా. జెకే. రేవంత్ నాథన్, మాల్తుమ్మెద సైంటిస్ట్ టీఆర్ వీకే, ఏంఏవో అనిల్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలనే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎంఏవో అనిల్ కుమార్, ఏఈవో సయిద్, ముఖిద్, మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ జహంగీర్, సైన్స్ ఉపాధ్యాయురాలు శిల్ప, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# అబాకస్‌లో స్మైల్స్ ది స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని విజయ లక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించిన అబాకస్ డిస్ట్రిక్ట్ లెవెల్ సెలక్షన్స్‌లో స్మైల్స్ ది స్కూల్ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో ప్రతిభ చూపారని పాఠశాల డైరెక్టర్ రఫీక్ గౌహర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అబాకస్‌లోని వివిధ కేటగిరీల్లో మొత్తంగా పది బహుమతులు గెలుచుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు సోహన్, ఆద్య, ఆరోహి, రితిక, జయాంష్, అన్విత్ రెడ్డి, నివేద, వివేక, ప్రహర్షిత్, ఆద్య జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులను సిబ్బంది అభినందించారు.